క్లుప్తంగా

11న మెగా జాబ్ మేళా

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక శ్రీకృష్ణ గీతాశ్రమంలో ఉన్న శ్రీవెంకటేశ్వర డిగ్రీ కాలేజిలో ఆగస్టు 11న మెగా జాబ్ మేళా నిర్వహించనున్నట్లు కళాశాల కరస్పాండెంట్ అర్కటవేముల హరినారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. టెక్ మహేంద్ర, జియో, ముత్తూట్ ఫింకార్ప్, అమెజాన్, హెచ్‌డీబీ ఫైనాన్సియల్ సర్వీసెస్, మెడ్‌ప్లస్, బ్లూ ఓషన్, ఫినో పేమెంట్ బ్యాంకు, మహేంద్ర హోం ఫైనాన్స్ ఇలా దేశ వ్యాప్తంగా ఉన్న 30 కంపెనీలు జాబ్‌మేళాలో పాల్గొంటాయని ఆయన వివరించారు. పదో తరగతి, ఇంటర్, డిగ్రీ, పీజీ, విద్యార్హత లేని వారు కూడా పాల్గొనవచ్చునని పేర్కొన్నారు. మేనిఫ్యాక్చరింగ్ యూనిట్స్ కూడా వస్తున్నాయని, ఈ అవకాశాన్ని నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వివరాలకు సెల్ నంబర్ 63012 25355కు సంప్రదించాలని పేర్కొన్నారు.

గర్భిణులకు సీమంతం

ప్రొద్దుటూరు : స్థానిక శివాజీ వీధిలోని ఐసీడీఎస్ అర్బన్ ప్రాజెక్టు అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం ఇన్నర్‌వీల్ క్లబ్ ఆధ్వర్యంలో గర్భవతులకు సీమంతాల కార్యక్రమం నిర్వహించారు. తల్లిపాల వారోత్సవాల సందర్భంగా తల్లిపాల విశిష్టతను వివరించి కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఇన్నర్‌వీల్‌క్లబ్ అధ్యక్షురాలు సరస్వతి, కార్యదర్శి పి.ఉషారాణి పాల్గొన్నారు.

వలంటీర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

మైదుకూరు : మున్సిపాలిటీలోని పలు సచివాలయాల పరిధిలో ఖాళీగా ఉన్న 15 వలంటీర్ పోస్టులకు అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ వై.రంగస్వామి తెలిపారు. 3వ సచివాలయంలో 2, 4వ సచివాలయంలో 1, 5వ సచివాలయంలో 2, 6వ సచివాలయంలో 2, 7వ సచివాలయంలో 2, 8వ సచివాలయంలో 1, 9వ సచివాలయంలో 2, 10వ సచివాలయంలో 3 వలంటీర్ పోస్టులు ఖాళీలు ఉన్నాయని ఆయన వివరించారు. ఇంటర్మీడియట్ పూర్తి చేసి 18-35 ఏళ్లలోపు ఉన్న వారు ఈనెల 10వ తేదీలోపు తమ దరఖాస్తులను పంపాలని సూచించారు.

పేదల భూములను అన్యాక్రాంతం చేస్తున్నారు

ప్రొద్దుటూరు : పేదల భూములను అధికారులు అన్యాక్రాంతం చేస్తున్నారని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బి.రామయ్య, పట్టణ కార్యదర్శి సుబ్బరాయుడు తెలిపారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొత్తపల్లె గ్రామ పంచాయతీ సుందరయ్య కాలనీలో పేదలకు ఇవ్వాల్సిన భూములను ఇతరులకు ఇచ్చారన్నారు. దీనిపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ నజీర్ అహ్మద్‌కు వినతి పత్రం సమర్పించారు.

కరపత్రాల ఆవిష్కరణ

ప్రొద్దుటూరు : మణిపూర్ ఆదివాసిలపై జరుగుతున్న దమనకాండను నిరసిస్తూ ప్రగతిశీల కార్మిక సమాఖ్య ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం కర పత్రాలను ఆవిష్కరించారు. విజయకుమార్ సర్కిల్‌లోని ఆటో స్టాండ్ వద్ద కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ప్రగతిశీల కార్మిక సమాఖ్య కన్వీనర్ నాగేంద్ర, నాయకులు శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగానికి విద్యార్థి ఎంపిక



విద్యార్థి వెంకటేష్‌ను అభినందిస్తున్న సీఐ నారాయణ , కోచింగ్ సెంటర్ డైరెక్టర్లు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక సృజన్స్ కోచింగ్ సెంటర్ విద్యార్థి ఉమ్మడి వెంకటేష్ కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన ఎస్ఎస్‌సీ (సీహెచ్ ఎస్ఎల్) ఫలితాల్లో ఉద్యోగం సాధించినట్లు కోచింగ్ సెంటర్ డైరెక్టర్లు సునీల్, సృజన్ కుమార్ తెలిపారు. ఈ విద్యార్థిని త్రీటౌన్ సీఐ నారాయణ యాదవ్ అభినందించారు. ఈ సందర్భంగా కోచింగ్ సెంటర్ డైరెక్టర్లు మాట్లాడుతూ తమ కోచింగ్‌సెంటర్‌లో ఉద్యోగార్థులకు అవసరమైన స్టడీ మెటీరియల్, షార్ట్‌కట్స్, అనుభవజ్ఞులైన అధ్యాపకులతో బోధన చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో శివాజీ, శంకర్, గౌస్, రత్నం పాల్గొన్నారు.

నేడు వైద్య శిబిరం

చాపాడు : మండలంలోని అల్లాడుపల్లెలో బుధవారం ఫ్యామిలీ డాక్టర్ వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు మండల వైద్యాధికారి డాక్టర్ రాజేష్ కుమార్ పేర్కొన్నారు. అల్లాడుపల్లె వైఎస్సార్ విలేజ్ క్లినిక్ వద్ద ఉదయం 9.30గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు నిర్వహించే వైద్య శిబిరంలో అన్ని రకాల వైద్య పరీక్షలు చేసి మందులను పంపిణీ చేస్తామన్నారు.

19న వార్డు మెంబర్ ఎన్నిక

మైదుకూరు : మండలంలోని తిప్పిరెడ్డిపల్లె పంచాయతీలో ఖాళీగా ఉన్న రెండో వార్డు సభ్యత్వానికి ఈనెల 19న ఎన్నిక నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ రమణారెడ్డి తెలిపారు. పంచాయతీలోని రెండో వార్డు సభ్యురాలు తన పదవికి గతంలో రాజీనామా చేశారన్నారు. ఆ స్థానానికి ఈనెల 10వ తేదీ వరకు నామినేషన్లు స్వీకరణ, 11న పరిశీలన, 14న నామినేషన్ల ఉపసంహరణ ఉంటుందన్నారు. ఎన్నిక అనివార్యమైతే తిప్పిరెడ్డిపల్లెలోని ప్రాథమిక పాఠశాల కుడివైపు ఉన్న తరగతి గదిలో ఈనెల 19న పోలింగ్ జరుపుతామన్నారు.

నిరుపేదల పక్షపాతి సీఎం వైఎస్ జగన్

గడప గడప మన ప్రభుత్వంలో ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి



లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రఘురామిరెడ్డి, నాగిరెడ్డిలు

బ్రహ్మంగారిమఠం : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిరుపేదల పక్షపాతి అని ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి తెలిపారు. మంగళవారం మండలంలోని పలుగురాళ్లపల్లె పంచాయతీ ఎర్రంపల్లె, ఎస్సీ కాలనీ, యాదవ నగర్, బొగ్గులవారిపల్లె, భాకరాపేట, జౌకుపల్లె గ్రామాల్లో గడప గడపకు ఎమ్మెల్యే తిరిగి ప్రభుత్వ పథకాలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నిరుపేదలకు ఆర్థిక సహాయం అందించాలనే సంకల్పంతో ప్రతి ఇంటికి ఏదొక పథకం అందేలా వలంటీర్లు కృషి చేశారన్నారు. అందుకే ప్రజలవద్దకు ధైర్యంగా వెళుతున్నామన్నారు. గత ప్రభుత్వంలో నిరుపేదలకు ప్రభుత్వ పథకాలు కావాలంటే జన్మభూమి కమిటీల ద్వారా సిఫారస్సు చేస్తేకాని అందేది కాదన్నారు. అదికూడా వాళ్ల పార్టీ వాళ్లకే అందేవన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక పార్టీలకు అతీతంగా ప్రతి నిరుపేదను గుర్తించి పథకాలు అందిస్తున్నామన్నారు. ఎర్రంపల్లె ఓసీ కాలనీలో డ్రైనేజీలు, సీసీ రోడ్లు, భాకరాపేటలో సీసీ రోడ్డు, బొగ్గులవారిపల్లెలో డ్రైనేజీలు కావాలని ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా స్పందించిన ఎమ్మెల్యే తక్షణం ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మైదుకూరు నియోజకవర్గం కన్వీనర్ శెట్టిపల్లె నాగిరెడ్డి, జెడ్పీటీసీ ఎం.రామగోవిందరెడ్డి, సింగల్‌విండో అధ్యక్షుడు నేలటూరి సుబ్బిరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మేకల రత్నకుమార్‌యాదవ్, గ్రామ సచివాలయాల మండల కన్వీనర్ రాజానాయుడు, సర్పంచ్ మార్తమ్మ, ఎంపీటీసీ లలితమ్మ, ఉపసర్పంచ్ బసిరెడ్డి దుగ్గిరెడ్డి, వాటర్‌షెడ్ అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి, కొత్తపల్లె నాగసుబ్బారెడ్డి, ఎంపీడీఓ వెంగమునిరెడ్డి, డీటీ జాన్స్, మండల స్థాయి అధికారులు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన ట్రైనీ ఎంపీడీఓలు

బ్రహ్మంగారిమఠంలో ట్రైనింగ్‌లో ఉన్న ఎంపీడీఓలు మంగళవారం ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డిని కలిశారు. ఎమ్మెల్యే మండలంలో పలుగురాళ్లపల్లె పంచాయతీలో గడప గడప మన ప్రభుత్వం కార్యక్రమంలో ఉండగా అక్కడికి చేరుకున్న ట్రైనీ ఎంపీడీఓలు ఎమ్మెల్యేను కలిసి ప్రభుత్వం నిరుపేదలకు అందిస్తున్న పథకాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి ట్రైనీ ఎంపీడీఓల గురించి మాట్లాడుతూ మీరు శిక్షణ కోసం బ్రహ్మంగారి మఠంకు రావడం సంతోషమన్నారు. మీరు ప్రతి గ్రామానికి వెళ్లి ప్రభుత్వం నిరుపేదలకు అందిస్తున్న పథకాల గురించి ఆరా తీయాలని సూచించారు. ఇంకా ఎవరైనా పథకాలకు అర్హులై అందని వారు ఉంటే మీరు గుర్తించి పథకం అందేలా చూడాలని ట్రైనీ ఎంపీడీఓలకు సలహా ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వెంగమునిరెడ్డి , నాయకులు పాల్గొన్నారు.

బీఎల్‌ఓలు ఇంటింటి సర్వే నిర్వహించాలి

అట్లూరు : బీఎల్‌ఓలు ప్రతి కుటుంబానికి వెళ్లి 18 సంవత్సరాలు నిండిన వారిని గుర్తించి ఓటు నమోదు చేయించాలని బద్వేలు రెవెన్యూ డివిజనల్ అధికారి ఆకుల వెంకటరమణ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక తహసీల్దార్ శ్రీవాణి నిర్వహించిన బీఎల్‌ఓల సమావేశాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలలో ప్రతి కుటుంబం వద్దకు వెళ్లినప్పుడు 18 సంవత్సరాలు నిండిన వారిని గుర్తించి ఓటు నమోదు చేయడంతో పాటు మృతి చెందిన వారు ఉంటే వారి మరణ ధ్రువీకరణ పత్రం తీసుకుని ఓటు తొలగించాలన్నారు. అలాగే శాశ్వత వలసదారులు ఉన్నట్లయితే వారిని గుర్తించి ఓటు తొలగించాలని తెలిపారు.

పిల్లలను బడికి పంపించండి

ఆర్డీఓ ఆకుల వెంకటరమణ మంగళవారం బీఎల్‌ఓల సమావేశం అనంతరం సోమశిల ముంపు ప్రాంతంలో నివాసం ఉంటున్న యానాదుల(ఎస్టీ) కుటుంబాలతో మాట్లాడారు. వారి పిల్లలు అక్కడే ఉండడంతో పిల్లలను తప్పని సరిగా బడికి పంపించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్‌తో పాటు ఎంపీడీఓ సుజాతమ్మ, ఆర్డీఓ కార్యాలయ ఏఓ రమణమ్మ, ఎన్నికల డీటీ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందాలి



ఇటుగుల్లపాడు సచివాలయ ఉద్యోగులతో మాట్లాడుతున్న నాగార్జునరెడ్డి

కాశినాయన : అర్హులైన ప్రతిఒక్కరికి ప్రభుత్వ పథకాలు అందేలా చూడాలని పంచాయతీరాజ్, రూరల్ డెవలప్‌మెంట్ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు పోతిరెడ్డి నాగార్జునరెడ్డి తెలిపారు. మంగళవారం మండలంలోని ఇటుగుల్లపాడు, సావిశెట్టిపల్లె గ్రామ సచివాలయాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటుగుల్లపాడు సచివాలయంలో ఉదయం 11 గంటలకు ముగ్గురు సిబ్బంది మాత్రమే ఉన్నారన్నారు. సచివాలయంలో అటెండెన్స్ రిజిస్టర్‌ను తనిఖీ చేసి సక్రమంగా ఉంచుకోవాలని సూచించారు. మధ్యాహ్నం 3 నుండి 5 గంటల వరకు నిర్వహించే స్పందన కార్యక్రమంలో సచివాలయ ఉద్యోగులందరూ పాల్గొనాలన్నారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వీరేశచార్యులకు యజుర్వేద వైదికరత్న బిరుదు



వీరేశచార్యులను సత్కరిస్తున్న ఆలయ నిర్వాహకులు, ఆర్యవైశ్య సంఘం నాయకులు

బద్వేలు అర్బన్ : స్థానిక మహాలక్ష్మీ, గోదాదేవి సహిత వేంకటేశ్వరస్వామి, అభయాంజనేయస్వామి ఆలయ ప్రధాన అర్చకుడు వీరేశచార్యులకు యజుర్వేద వైదికరత్న బిరుదు లభించింది. హైదరాబాద్‌కు చెందిన లలిత కళా సామాజిక సంస్థ, రుద్రాక్ష వైభవం ఆధ్యాత్మిక పీఠం సంయుక్తంగా నిర్వహించిన కార్యక్రమంలో వీరేశచార్యులను సువర్ణ కంకణంతో సత్కరించి బిరుదు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా మంగళవారం స్థానిక ఆలయంలో ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు వల్లంకొండు వెంకటరమణ, సెక్రటరీ అంకయ్య, ఆర్యవైశ్య వర్తక సంఘం అధ్యక్ష, కార్యదర్శులు కె.వి.సుబ్బారావు, కొలిశెట్టి నాగరాజ, మార్కెట్ కమిటీ డైరెక్టర్ పబ్బతి చంద్రశేఖర్ తదితరులు ఆయనను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ప్రముఖ వేద పండితులు మురళీధర్‌శర్మ, సుబ్రమణ్యశర్మ, ఆర్యవైశ్య సంఘం నాయకులు సురేష్‌బాబు, వెంకటశివనారాయణ, పత్తినాగేంద్రప్రసాద్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం నూతన కమిటీ ఎన్నిక



వ్యవసాయ కార్మిక సంఘం నూతన కమిటీని ప్రకటిస్తున్న జిల్లా ప్రధాన కార్యదర్శి సుబ్రమణ్యం

బద్వేలు అర్బన్ : ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం నూతన కమిటీని మంగళవారం స్థానిక సీపీఐ కార్యాలయం జె.వి.భవన్‌లో ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సి.సుబ్రమణ్యం ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. వ్యవసాయ కార్మిక సంఘం బద్వేలు ఏరియా జనరల్‌బాడీ సమావేశంలో నూతన కమిటీని ఎన్నుకోగా ఇందులో అధ్యక్షుడిగా ఎస్.తిరుపాలు, ప్రధాన కార్యదర్శిగా ఎస్.సుబ్రమణ్యం, ఉపాధ్యక్షులుగా నారాయణ, షాహిద, సహాయ కార్యదర్శులుగా వెంకటరమణ, విష్ణు, విజయరావులతో పాటు 11 మందిని సభ్యులుగా ఎన్నుకున్నారు సమావేశంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు వీరశేఖర్, ఏరియా సహాయ కార్యదర్శి మస్తాన్, గోపవరం, బి.కోడూరు మండలాల కార్యదర్శులు పెంచలయ్య, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఫేర్‌వెల్ డే వేడుకలు



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ పాండురంగన్ రవి

ప్రొద్దుటూరు కల్చరల్ : మండల పరిధిలోని సాయి రాజేశ్వరి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఇంజనీరింగ్ కళాశాలలో ఎంబీఏ విద్యార్థులు ఫేర్‌వెల్ డే వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల కరస్పాండెంట్ బసిరెడ్డి వీరకళ్యాణ్ రెడ్డి, ప్రిన్సిపాల్ పాండురంగన్ రవి మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదువుకుని మంచి ఫలితాలు సాధించాలన్నారు. భవిష్యత్తులో ఉన్నత స్థానాల్లో నిలిచి తల్లిదండ్రుల కలలను నెరవేర్చాలన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ బసిరెడ్డి రాజేశ్వరరెడ్డి, వైస్ ప్రెసిడెంట్ వీర కుమార్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ వెంకటేశ్వరరెడ్డి, అకడమిక్ డీన్ సుబ్బారెడ్డి, హెచ్‌ఓడీ షబానాబీ తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్ల ఆవిష్కరణ



ఏపీ ఎన్జీఓ రాష్ట్ర కౌన్సిల్ మహాసభల పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి

ప్రొద్దుటూరు : ఏపీ ఎన్జీఓ రాష్ట్ర కౌన్సిల్ మహాసభల ఆహ్వాన పత్రాన్ని మంగళవారం ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డికి ఏపీ ఎన్జీఓ అసోసియేషన్ తాలూకా అధ్యక్షుడు కేజీ రఘురామిరెడ్డి, కార్యదర్శి రామసుబ్బయ్య, మహిళా విభాగం చైర్‌పర్సన్ ఆర్.జయమ్మ అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈనెల 21, 22 తేదీల్లో విజయవాడలో ఏపీ ఎన్జీఓ రాష్ట్ర కౌన్సిల్ మహాసభలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ మహాసభలను రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు బండి శ్రీనివాసరావు, కేవీ శివారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారని, ఈ మహాసభలకు సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి, మంత్రి బొత్స సత్యనారాయణ, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్ రెడ్డి, ఇతర మంత్రులు హాజరవుతారని తెలిపారు. ఈ సభలకు హాజరు కావాలని ఎమ్మెల్యేను కోరారు. అనంతరం ఎమ్మెల్యే మహాసభల వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎన్జీఓ అసోసియేషన్ సహ అధ్యక్షుడు సదాశివయ్య, వైస్ ప్రెసిడెంట్ జయంతి కుమారి, సంధ్యా, ఆర్గనైజేషన్ సెక్రటరీ ప్రభంజన్ రెడ్డి, జాయింట్ సెక్రటరీ సుమ రాజా, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్రవాహనాలు సీజ్

ప్రొద్దుటూరు క్రైం : పట్టణంలో శబ్ద కాలుష్యాన్ని కలిగిస్తున్న వాహనాలపై మంగళవారం స్పెషల్ డ్రైవ్ చేపట్టినట్టు ట్రాఫిక్ సీఐ యుగంధర్ తెలిపారు. కంపెనీ ఫిట్టెడ్ సైలెన్సర్‌ను మార్చి నిషిద్ధ సైలెన్సర్లను బిగించి నడుపుతున్న ద్విచక్రవాహనాలను సీజ్ చేసి యజమానులకు సీఐ కౌన్సిలింగ్ ఇచ్చారు. సీఐ మాట్లాడుతూ భారీ శబ్దాలను చేస్తున్న వాహనాల వల్ల గుండె జబ్బులు కలిగిన వారు, వయస్సు మీద పడిన వృద్ధులు భయపడుతున్న పరిస్థితులు ఎదురవుతున్నాయన్నారు. శబ్ద కాలుష్యానికి కారణమవుతున్న ద్విచక్రవాహనాలను సీజ్ చేయడంతోపాటు జరిమానాలు విధిస్తామని హెచ్చరించారు.

వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్ల పంపిణీ

ప్రొద్దుటూరు క్రైం : మండలంలోని కామనూరు సెక్టర్ రాజీవ్ నగర్ కాలనీలో ఉన్న ఇందిరానగర్-2లో అంగన్‌వాడీ సెంటర్‌లో మంగళవారం వైఎస్సార్ సంపూర్ణ పోషణ టేక్ హోం రేషన్ కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ బీపీ వరప్రసాద్ మాట్లాడుతూ గర్భవతులు, బాలింతలు, చిన్నారులలో పోషకాహార లోపాన్ని నివారించేందుకు సంపూర్ణ పోషణ కిట్లను ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పంపిణీ చేస్తోందని తెలిపారు.

దస్తులు పంపిణీ

ప్రొద్దుటూరు : గోపికృష్ణ విద్యాసంస్థల చైర్మన్ కేవీ రమణారెడ్డి ద్వితీయ వర్ధంతి సందర్భంగా మంగళవారం దివ్యాంగులకు దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గోపికృష్ణ విద్యాసంస్థల చైర్మన్ ప్రదీప్ రెడ్డి, వైస్ చైర్మన్ సందీప్‌రెడ్డి మాట్లాడుతూ మా నాన్న వర్ధంతి సందర్భంగా మంగళవారం 150 మందికిపైగా దివ్యాంగులకు వివిధ ప్రాంతాల్లో సేవా కార్యక్రమాలను నిర్వహించామన్నారు. చీరెలు, దుప్పట్లు, స్వెటర్లు అందించామన్నారు. కార్యక్రమంలో ఆల్ ఆఫ్ యూ దివ్యాంగుల వయోవృద్ధుల సేవా సొసైటీ గౌరవాధ్యక్షుడు చలపతి రావు, రాష్ట్ర అధ్యక్షుడు అఫ్జల్, అల్తాఫ్ సావిత్రి, సంజీవ్‌కుమార్, రమణ పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

కాశినాయన : మండలంలోని నరసాపురం ఏపీ మోడల్ పాఠశాల విద్యార్థులకు వివేకానంద ఫౌండేషన్ సంస్థ ఆధ్వర్యంలో మానవతా విలువలపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థ గౌరవ సలహాదారు రాజోలిశ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు చిన్ననాటి నుండే నైతిక విలువలు కలిగి ఉండాలన్నారు. ఈ పోటీల వలన విద్యార్థులు తమ వ్యక్తిత్వాన్ని పెంపొందించుకోవచ్చని అన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ సౌజన్య, సంస్థ వ్యవస్థాపకుడు పి.రామకృష్ణారెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా తల్లిపాల వారోత్సవాలు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక కాత్యా నర్సింగ్ హోంలో మంగళవారం ఇన్నర్ వీల్ క్లబ్ ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. డాక్టర్ కాత్యా మాట్లాడుతూ ముర్రుపాలు బిడ్డకు తాపించడం వల్ల పిల్లలకు వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని, మెదడు వాపు వ్యాధిని అరికట్టవచ్చని గర్భవతులకు వివరించారు. అనంతరం కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఇన్నర్ వీల్ ప్రెసిడెంట్ సరస్వతి రెడ్డి, సెక్రటరీ ఉషారాణి, ట్రెజరర్ అనురాధ పాల్గొన్నారు.

నూతన కలర్‌లో సుజుకి యాక్సెస్ 125



కొనుగోలుదారునికి కీ అందిస్తున్న షోరూం నిర్వాహకులు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక సుజుకి ఖ్వాజ ఆటో మోటివ్స్ షోరూంలో సరికొత్త కలర్‌లో సుజుకి యాక్సెస్ 125 స్కూటర్‌ను ప్రారంభించారు. షోరూం ఎండీ సోహెల్ మాట్లాడుతూ ఈ స్కూటర్‌లో ఫుల్ డిజిటల్ మీటర్, ఎల్ఈడీ లైటింగ్, మొబైల్ చార్జర్, డిస్క్ బ్రేక్ తదితర సౌకర్యాలు ఉన్నాయన్నారు. కార్యక్రమంలో షోరూం సీఈఓ అబ్దుల్ నబి, షోరూం మేనేజర్ చాంద్ బాషా, సేల్స్ సిబ్బంది పాల్గొన్నారు.

కచ్చితమైన హద్దులు నిర్ధారించేందుకే సర్వే

ఆర్‌డీఓ వెంకటరమణ



రోడ్డుకు హద్దులు పరిశీలిస్తున్న అధికారులు

పోరుమామిళ్ల : పోరుమామిళ్లలో 4 లైన్ల రహదారి నిర్మాణంలో రోడ్డు విస్తరణకు కచ్చితమైన హద్దులు నిర్ధారించేందుకే మరొక సారి సర్వే చేస్తామని ఆర్‌డీఓ ఆకుల వెంకటరమణ తెలిపారు. మంగళవారం రోడ్లు భవనాల శాఖ అధికారులతో కలసి ఆయన పట్టణంలో ప్రభుత్వ ఆసుపత్రి వద్ద రోడ్డును పరిశీలించారు. అంబేద్కర్ సర్కిల్ నుంచి సాయిబాబా మందిరం వరకు రోడ్డు ఒకవైపు రెండులైన్ల నిర్మాణం జరగ్గా మరోవైపు ఒకలైన్ మాత్రమే నిర్మాణం జరిగింది. అదికూడా మధ్య మధ్యలో కొంత వదిలివేశారు. సోమవారం సాయంత్రం ప్రభుత్వ కళాశాల మైదానానికి నిర్మించిన ప్రహరీ తొలగించారు. రెండవ లైన్ నిర్మించేందుకు ప్రభుత్వ ఆసుపత్రి నుంచి బస్టాండు వరకు భవనాల ముందు భాగం తొలగించాల్సి ఉంది. ఈ నేపథ్యంలో రెవెన్యూ, ఆర్‌అండ్‌బీ శాఖల అధికారులు రోడ్డును మంగళవారం పరిశీలించారు.

ఈ సందర్భంగా ఆర్‌డీఓ మీడియాతో మాట్లాడుతూ రెవెన్యూ రికార్డుల మేరకు ఎంత స్థలం ఉందో సర్వే చేసి గతంలో మార్కింగ్ వేశామని, ఆ మేరకు ఇళ్ల యజమానులకు నోటీసులు ఇచ్చామన్నారు. అయితే ఆర్ అండ్ బీ రికార్డుల్లో రోడ్డు ఎంత ఉందో పరిశీలించి, రెవెన్యూ, ఆర్ అండ్‌బీ రికార్డులను సమన్వయం చేసుకుని కచ్చితమైన హద్దులు నిర్ణయించేందుకు మరొకసారి సర్వే చేస్తామన్నారు. సర్వే ఈ నెలాఖరులోగా పూర్తి చేసి ఆ మేరకు నిర్మాణాలు తొలగించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఆర్‌అండ్‌బీ ఈఈ ప్రభాకర్ నాయుడు, తహసీల్దార్ గంగయ్య, ఆర్‌అండ్‌బీ, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

పశుపోషణపై అవగాహన పెంచుకోవాలి



మేకవారిపల్లెలో లేగదూడల ప్రదర్శనలో విజేతలకు బహుమతులను ప్రదానం చేస్తున్న అధికారులు

బి.కోడూరు : పాడిరైతులు పశుపోషణపై అవగాహన పెంచుకోవాలని పశుసంవర్ధకశాఖ పశుగణాభివృద్ధి ఉప సంచాలకులు డాక్టర్ రమేష్ పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని మేకవారిపల్లె, ఆనంవారిపల్లె గ్రామాల్లో రాష్ట్రీయ గోకుల్ మిషన్, పశుగణాభివృద్ధి వారి పర్యవేక్షణలో లేగదూడల ప్రదర్శన కార్యక్రమం నిర్వహించారు. మేకవారిపల్లెలో నిర్వహించిన కార్యక్రమంలో సర్పంచ్ లక్ష్మీనరసారెడ్డి, మండల ఉపాధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి, ఆనంవారిపల్లెలో జెడ్పీటీసీ దావీదు, రామసముద్రం సర్పంచ్ ఆదిలక్ష్మిలు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వాతావరణం ద్వారా వచ్చే వ్యాధులను అధిగమించడానికి పాడి పశువులకు టీకాలు వేయించాలని సూచించారు. ప్రభుత్వం పాడి రైతులకు రాయితీ ద్వారా పశుదాణా అందిస్తుందన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం గ్రామాల్లోని పది రోజుల నుంచి ఏడు నెలల దూడల ప్రదర్శన నిర్వహించారు. ప్రదర్శనలో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో బి.మఠం సహాయ సంచాలకుడు డాక్టర్ వెంకటసుబ్బయ్య, పశువైద్యాధికారి భరద్వాజకృష్ణ, సిబ్బంది నందిని, సిద్దయ్య, రాజశేఖర్, పాడిరైతులు పాల్గొన్నారు.

నులిపురుగుల నిర్మూలన కార్యక్రమంపై శిక్షణ



బి.కోడూరు పీహెచ్‌సీలో నులిపురుగుల నివారణ మాత్రలను పంపిణీ చేస్తున్న వైద్యాధికారులు



జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం కార్యక్రమ పోస్టర్లను విడుదల చేస్తున్న వైద్య సిబ్బంది

బి.కోడూరు : మండల కేంద్రమైన బి.కోడూరులోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం వైద్యాధికారులు డాక్టర్ వినీత్‌కుమార్‌రాజు, డాక్టర్ ఉదయ్‌కిరణ్‌ల ఆధ్వర్యంలో జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమంపై ఒకరోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారులు మాట్లాడుతూ ఈ నెల 10వ తేదీన పాఠశాల విద్యార్థులకు, అంగన్వాడీ చిన్నారులకు నులిపురుగుల నివారణ మాత్రలు పంపిణీ చేస్తామని తెలిపారు. ఉపాధ్యాయులు, అంగన్వాడీ కార్యకర్తలకు మందును ఎలా పంపిణీ చేయాలో వివరించారు. అనంతరం వైద్య సిబ్బంది నులిపురుగుల నివారణ మాత్రలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ నాగమణి, ఆరోగ్య విస్తరణాధికారి శ్రీనివాసరెడ్డి, పీహెచ్ఎన్ పుష్పాంజలి, సూపర్‌వైజర్లు జాన్‌విలియం, విజయలక్ష్మీ, రాజమ్మ, హెల్త్ అసిస్టెంట్ రామతీర్థం, ఏఎన్ఎంలు, వైద్య సిబ్బంది, అంగన్వాడీ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

నులిపురుగుల నిర్మూలన దినోత్సవాన్ని విజయవంతం చేయాలి

గోపవరం : ఈ నెల 10వ తేదీన నిర్వహించే జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీఓ హరినారాయణ తెలిపారు. మంగళవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారి వెంకటరత్నాలుతో కలిసి పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంగన్వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తలు, ఉపాధ్యాయులు ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంఈఓ చెన్నయ్య, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లక్ష్మీదేవి, సీహెచ్‌ఓ గౌస్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ట్రాఫిక్ సిగ్నల్స్‌ను పునరుద్ధరించాలి



ఏఎస్పీ ప్రేరణ కుమార్‌కు వినతి పత్రం ఇస్తున్న ప్రొద్దుటూరు బీసీ సమాఖ్య నాయకులు

ప్రొద్దుటూరు క్రైం : పట్టణంలోని ట్రాఫిక్ సిగ్నల్స్‌ను పునరుద్ధరించాలని ప్రొద్దుటూరు బీసీ సమాఖ్య అధ్యక్షుడు డాక్టర్ సోమా లక్ష్మీనరసయ్య కోరారు. ఈ మేరకు ఆయన సమాఖ్య సభ్యులతో కలసి ఏఎస్పీ ప్రేరణ కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొంత కాలంగా రాజీవ్ సర్కిల్, శివాలయం సెంటర్, విజయ్‌కుమార్ సర్కిల్, వన్‌టౌన్ సర్కిల్‌లలో ఉన్న ట్రాఫిక్ సిగ్నల్స్‌పని చేయడం లేదన్నారు. దీని వల్ల వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారని తెలిపారు. వెంటనే ట్రాఫిక్ సిగ్నల్స్‌ను మరమ్మతులు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సమాఖ్య కార్యనిర్వాహక అధ్యక్షులు గొడుగు గుర్రప్ప, ప్రధాన కార్యదర్శి బీవీ రమణరాజు, కోశాధికారి వజ్జల వెంకట కృష్ణయ్య యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఈ నెల 11 నుంచి హజరత్ సయ్యద్ సర్దార్ బాబా గంధ మహోత్సవం



హజరత్ సయ్యద్ సర్దార్ బాబా సమాధి

కలసపాడు : మండలంలోని శంఖవరం గ్రామంలో వెలసిన హజరత్ సయ్యద్ సర్దార్ బాబా ఉరఫ్ బుర్హానుద్దీన్ చిష్టి స్వామి వారి గంధ మహోత్సవం ఈ నెల 11, 12, 13 తేదీల్లో ఘనంగా నిర్వహిస్తున్నట్లు దర్గా ముజావర్ పి.ఓబయ్య (ఖాజామొయినుద్దీన్) తెలిపారు. ఇందులో భాగంగా 11వ తేదీ శుక్రవారం రాత్రి 8 గంటలకు ఫకీర్ జరబులతో, ఖసీదాఖాని (మిలాద్)తో స్వామి వారి గది నుంచి గంధం దర్గాకు బయలుదేరుతుందన్నారు. రాత్రి 7 గంటలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. 12వ తేదీన రాత్రి దీపాలంకరణ జరుగుతుందని, 13వ తేదీ ఉదయం 10 గంటలకు తహలీల్ ఫాతేహా జరుగుతుందని తెలిపారు. ఈ గంధ మహోత్సవంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామి వారి కృపకు పాత్రులు కాగలరని కోరారు.

సచివాలయాలు త్వరితగతిన పూర్తి చేయండి

బ్రహ్మంగారిమఠం : మండలంలో జరుగుతున్న గ్రామ సచివాలయాలు, హెల్త్ క్లినిక్‌లు, ఆర్బీకేల నిర్మాణాలను త్వరితగతిన పూర్తిచేయాలని పంచాయతీరాజ్ ఎస్ఈ శ్రీనివాసులరెడ్డి తెలిపారు. మంగళవారం బి.మఠం మండలంలో జరుగుతన్న పనులను ఆయన పరిశీలించారు. అనంతరం పనులు చేస్తున్న కాంట్రాక్టర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఈ మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశాల మేరకు ఈ నెల చివరికల్లా నిర్మాణాలు పూర్తి కావాలని ఆదేశించారన్నారు. అందుకు అనుగుణంగా మీరు పనులు పూర్తి చేయాలన్నారు. ఇందుకోసం గ్రామాల్లో పల్లె నిద్ర కూడా చేస్తున్నామన్నారు. మండలంలో 14 గ్రామ సచివాలయలు ఉండగా అందులో కేవలం రెండు మాత్రమే ప్రారంభమయ్యాయని పేర్కొన్నారు. మిగిలిన వాటిలో 6 ప్రారంభం కావాల్సి ఉండగా, 8 గ్రామ సచివాలయాలు నిర్మాణ దశలో ఉన్నాయన్నారు.

అక్రమ నిర్మాణం తొలగింపు

ప్రొద్దుటూరు : టూటౌన్ బైపాస్ రోడ్డులోని వాజ్‌పేయినగర్‌లో అక్రమ నిర్మాణాన్ని రెవెన్యూ అధికారులు మంగళవారం తొలగించారు. మున్సిపాలిటీ స్థలాన్ని ఆక్రమించి ఓ వ్యక్తి నిర్మాణ పనులు ప్రారంభించగా విషయం తెలుసుకున్న అధికారులు జేసీబీతో తొలగించారు.